సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



సహించేది లేదు

ఆస్పత్రి భవన నిర్మాణం ప్రమాణాలకు తగ్గట్టుగా ఉండాలని, నాణ్యత లేకుంటే సహించేదిలేదని డిప్యూటీ సీఎం బూడి అన్నారు. 8లో



తల్లి పాలు ఎంతో శ్రేష్టం

నవజాత శిశువుకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి అన్నారు. 8లో



సమస్యలపై వినతిపత్రం

నర్సీపట్నం: తమ సమస్యలను పరిష్కరించాలని డీఎఫ్‌వో రాజారావుకు అటవీ ఉద్యోగులు గురువారం వినతిపత్రం అందజేశారు.

న్యూస్‌రీల్

ఏలేరు గండి పూడ్చివేత



గండి పడిన ప్రాంతంలో పూర్తయిన పనులు

మాకవరపాలెం: ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. మండలంలోని రాచపల్లి వద్ద ఏలేరు కాలువకు ఆదివారం అర్ధరాత్రి గండి పడిన సంగతి తెలిసిందే. సోమవారం నుంచి బుధవారం సాయంత్రం వరకు పనులు చేపట్టేందుకు అవకాశం లేకపోవడంతో చివరికి బుధవారం సాయంత్రం పనులు ప్రారంభించారు. గురువారం మధ్యాహ్నానికి పూడ్చివేత పనులు పూర్తయ్యాయి. గండి కారణంగా కాలువ ద్వారా నిలిపివేసిన నీటి సరఫరాను మళ్లీ యథావిధిగా పునరుద్ధరించనట్టు జీవీఎంసీ అధికారులు తెలిపారు.

కోనాం జలాశయాన్ని పరిశీలించిన ఈఈ



కోనాం జలాశయం నీటి వివరాలు సేకరిస్తున్న ఈఈ

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయాన్ని ఇరిగేషన్ ఈఈ కె.త్రినాథం గురువారం సందర్శించారు. ఈ మేరకు ఖరీఫ్‌కు విడుదలవుతున్న నీటి వివరాలు సేకరించారు. ఎగువ కాలువ ద్వారా 30 క్యూసెక్కులు, దిగువ కాలువ ద్వారా 70 క్యూసెక్కుల నీటిని ఖరీఫ్ సాగుకు విడుదల చేస్తున్నట్లు ఏఈ రఘురాం ఆయనకు తెలిపారు. ప్రస్తుత నీటిమట్టం 99 మీటర్ల వద్ద కొనసాగుతోందన్నారు.

ఫుడ్ కమిటీ సభ్యుడి ఆకస్మిక తనిఖీలు

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎండీయూ ఆపరేటర్‌కు మెమోలు



కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఆహార కమిటీ సభ్యుడు కాంతారావు

చోడవరం రూరల్: రాష్ట్ర ఆహార కమిటీ సభ్యుడు బి.కాంతారావు గురువారం మండలంలో ఆకస్మికంగా జరిపిన పర్యటనలో ఇద్దరు అంగన్‌వాడీ కార్యకర్తలు, నిత్యావసరాల సరఫరా వాహన నిర్వాహకుడు ఒకరికి మెమోలు జారీ చేయాల్సిందిగా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆయన స్థానిక స్కూళ్లు, అంగన్‌వాడీల్లో తనిఖీలు నిర్వహించారు. మండలంలోని లక్ష్మీపురం, ద్వారకానగర్ అంగన్‌వాడీలు, రేషన్ సరఫరా వాహనాల రికార్డుల పరిశీలనలో అవకతవకలపై ఆగ్రహించారు. అంబేడ్కర్ కాలనీకి రేషన్ సరఫరా చేసే 18వ నెంబర్ వాహనం నిర్వాహకుడి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలో జగనన్న గోరు ముద్దను విద్యార్థులతోపాటు తిని, సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ అమలు తీరుపై విద్యార్థులను ఆరా తీశారు. ఎండీఎం రికార్డులను పరిశీలించారు. ఆయనతోపాటు వచ్చిన జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రతినిధుల బృందం కో ఆర్డినేటర్లు అచ్యుతరావు, శ్రీనివాసరావులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆకస్మిక తనిఖీలో మండల విద్యాశాఖాధికారి జయలక్ష్మి, సీఆర్‌పీ కె.వి.మహాలక్ష్మినాయుడు, రవిశంకర్, పాల్గొన్నారు.

టిడ్కో జిగేల్



మధురవాడలో నిర్మించిన టిడ్కో ఇళ్లు

సాక్షి, విశాఖపట్నం : పట్టణ పేద ప్రజలు ఆత్మ గౌరవంతో సగర్వంగా జీవించేలా తీర్చిదిద్దిన టిడ్కో ఇళ్లకు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వెలుగులు అందించడంలో నిమగ్నమైంది. దాదాపు ఇళ్లు పూర్తయిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసింది. వీధి దీపాలను సైతం అమర్చుతోంది. దరఖాస్తు వచ్చిన 48 గంటల్లోనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ అందజేస్తోంది. విశాఖ సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు రూ.6.13 కోట్లు ఖర్చు చేసి 1,236 ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని అందించింది.

సకల సౌకర్యాల కల్పన

పట్టణాలు, నగరాల్లో నివసించే పేదలు 300 చదరపు అడుగుల ఇల్లు పొందాలంటే చంద్రబాబు ప్రభుత్వం రూ.7.50 లక్షల భారం మోపింది. అదీ 20 ఏళ్లపాటు వాయిదాలు కట్టేలా షరతులు విధించింది. కానీ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అదే ఇంటిని పేదలకు కేవలం ఒకే ఒక్క రూపాయికి అందిస్తోంది. పైగా అక్కచెల్లెమ్మల పేరు మీద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోంది. 365, 430 చ.అడుగుల ఇళ్లకు లబ్ధిదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 శాతానికి తగ్గించింది. అంతే కాదు.. ఒక ఇంటికి కావల్సిన మౌలిక వసతులు కల్పిస్తోంది. టిడ్కో ఇళ్లకు పక్కా రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం కల్పించిన తర్వాతే లబ్ధిదారులకు అందిస్తోంది. ప్రతి ఇంటికీ విద్యుత్ సౌకర్యం అందించే బాధ్యతను ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

దరఖాస్తు వచ్చిన వెంటనే..

విశాఖపట్నం సర్కిల్ పరిధిలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు అవసరమైన విద్యుత్ సరఫరాను అందించేందుకు ఈపీడీసీఎల్ అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇంటికి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు వచ్చిన 24 నుంచి 48 గంటల్లోనే సరఫరా అందించేలా చర్యలు చేపడుతున్నారు. సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలో నిర్మితమవుతున్న టిడ్కో ఇళ్లకు సంబంధించి ఎప్పటికప్పుడు అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ ఇళ్ల కోసం విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేందుకు మొత్తం రూ.55.55 కోట్లు అంచనా వ్యయాన్ని నిర్దేశించుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకు రూ.6.13 కోట్లు ఖర్చు చేసి 1,236 ఇళ్లకు విద్యుత్ సౌకర్యాన్ని అందించారు.



టిడ్కో ఇళ్లకు ఏర్పాటు చేసిన మీటర్లు

'విద్యుత్' వెలుగులు

- విశాఖ సర్కిల్ పరిధిలో రూ.55.55 కోట్లతో పనులు
- ఇప్పటికే రూ.6.13 కోట్లతో పనుల పూర్తి
- 1,236 ఇళ్లకు మీటర్లు అమర్చిన ఈపీడీసీఎల్
- దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే విద్యుత్ కనెక్షన్



ఏఎస్ఆర్ నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్‌సిబ్బంది

ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ పరిధిలో..

డివిజన్	అంచనా వ్యయం (రూ.కోట్లలో)	ఖర్చు సరఫరా (రూ.కోట్లలో)	విద్యుత్ ప్రారంభమైన ఇళ్లు
జోన్-1(విశాఖపట్నం)	0.653	0.653	221
జోన్-2(విశాఖపట్నం)	24.968	2.903	230
జోన్-3(విశాఖపట్నం)	4.664	1.649	505
అనకాపల్లి	0.318	0.318	00
కశింకోట(యలమంచిలి)	17.465	0.608	280
నర్సీపట్నం	7.480	00	00
విశాఖపట్నం సర్కిల్	55.55	6.13	1236

నిరంతరం సమీక్షిస్తున్నాం..



ఈపీడీసీఎల్ సీఎండీ మార్గదర్శకాల మేరకు టిడ్కో ఇళ్లకు విశాఖ సర్కిల్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లు వెంటనే అందించేందుకు ప్రత్యేక సిబ్బందితో కూడిన వ్యవస్థని అందుబాటులోకి తీసుకొచ్చాం. దరఖాస్తులు వచ్చిన వెంటనే వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కనెక్షన్ అందజేస్తున్నాం. దాదాపు ఇళ్లు పూర్తయిన ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధి దీపాల్ని సైతం అమర్చుతున్నాం. టిడ్కో ఇళ్లకు విద్యుత్ వెలుగులు అందించే విషయంలో ఎక్కడా రాజీ పడకుండా శ్రమిస్తున్నాం.

– మహేంద్రనాథ్, ఎస్ఈ, ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్

'లంపీస్కిన్'కు అడ్డుకట్ట

- జిల్లా వ్యాప్తంగా 1,49,100 లంపీస్కిన్ డోసులు సిద్ధం
- ఆగస్టు నెలాఖరుకు టీకాలు పూర్తి చేయడమే లక్ష్యం



లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువులు

సాక్షి, అనకాపల్లి: పాడి రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు), పశువులకు సంచార అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. పాడి రైతుకు మరింత ఆసరాగా నిలిచేందుకు ముందస్తుగా లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తోంది. గతేడాది ఆగస్టు–సెప్టెంబర్ మధ్యలో లంపీస్కిన్ వ్యాధితో దేశ వ్యాప్తంగా చాలా పశువులు మృత్యువాత పడ్డాయి. దీంతో ఏపీ ప్రభుత్వం ఈసారి అప్రమత్తమైంది.

ముందుగానే వ్యాక్సిన్లు

నెల రోజుల ముందుగానే పశువులు లంపీస్కిన్ వైరస్ బారిన పడకుండా పశు సంవర్ధక శాఖ టీకాల కార్యక్రమం ప్రారంభించింది. ఆగస్టు 1 నుంచి 31 వరకూ ప్రతీ ఆర్బీకే పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పాడి రైతుల వద్దకే వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారు. అగ్రి అసిస్టెంట్ పర్యవేక్షణలో ప్రధానంగా తెల్లజాతి పశువులను గుర్తించి ముందుగా వ్యాక్సిన్‌లు వేస్తున్నారు. జిల్లాలో దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో స్వల్పంగా లంపీస్కిన్ వైరస్ ప్రభావం ఉంది.

లంపీస్కిన్ వ్యాధి కారక క్యాప్రిపాక్స్ వైరస్ ఎక్కువగా తెల్ల జాతి ఆవులు, ఎద్దులలో వ్యాపిస్తోంది. ఇది రక్తాన్ని పీల్చే దోమలు, ఇతర కీటకాల ద్వారా ఒక జంతువు నుంచి మరో జంతువుకు సంక్రమిస్తోంది.

1,49,100 డోసులు సిద్ధం

జిల్లాలో మొత్తం లక్షా 85 వేల పశువులున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. తొలి విడతలో గతేడాది సెప్టెంబర్‌లో 25 వేల వ్యాక్సిన్లు వేశారు. ఈ ఏడాది లంపీస్కిన్ వ్యాధి సీజన్‌కు నెల ముందుగానే జిల్లా వ్యాప్తంగా లక్షా 49 వేల 100 టీకా డోసులు సిద్ధం చేశారు. ఇప్పటికే వీటిలో లక్షా 48 వేల 100 డోసులను ఆర్బీకేలకు సరఫరా చేశారు.

లక్షణాలు ఇవే..

వైరస్ సోకిన దాదాపు ఒక వారం తర్వాత జ్వరం వస్తుంది. ఈ జ్వరం 41 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉండవచ్చు. వారం పాటు జ్వరం కొనసాగుతుంది. ఈ సమయంలో చర్మంపై బొడిపెలు విస్తరిస్తాయి. కళ్లవెంబడి నీరు కారుతూ ఉంటుంది. తీవ్రమైన నొప్పులు, చర్మం పెళుసుగా మారుతుంది. ఆ సమయంలో సరిగా మేత మేయలేవు. పాడి పశువులైతే పాలివ్వవు. బలవంతంగా పాలు తీయడం కూడా సరికాదు. లంపీస్కిన్ సోకిన పశువుల పాలను తాగడం కూడా ప్రమాదమే.

పాడి రైతులకు అండగా ప్రభుత్వం



లంపీ స్కిన్ వ్యాధిని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. గత ఏడాది ఆగస్టు– సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి తీవ్రతరమైంది. అప్పుడు జిల్లాలో 25 వేల వ్యాక్సిన్లు వేశాం. అప్పుడే మరో లక్షా 50 వేల వ్యాక్సిన్లు కావాలని అడిగాం. దీంతో ప్రభుత్వం ఈ ఏడాది నెల రోజులకు ముందుగానే లక్షా 49 వేల 100 లంపీస్కిన్ వ్యాక్సిన్లు ఇచ్చింది. ప్రతీ ఆర్బీకే పరిధిలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ ద్వారా ప్రతీ రైతు వద్దకు వెళ్లి తెల్లజాతి పశువులకు వ్యాక్సిన్లు వేసేలా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాం. పాడి రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోంది.

– ప్రసాదరావు, పశు సంవర్ధక శాఖ జేడీ, అనకాపల్లి జిల్లా

అనకాపల్లి ఆర్వోగా జేసీ జాహ్నవి

తుమ్మపాల: వచ్చే సార్వత్రిక ఎన్నికల కోసం అనకాపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా జేసీ ఎం.జాహ్నవిని ఎన్నికల సంఘం నియమించింది. ఈఆర్వోగా అనకాపల్లి ఆర్డీవో జి.చిన్నికృష్ణ, ఏఈఆర్వోలుగా ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ తహసీల్దార్లు వ్యవహరిస్తారు. మున్సిపాలిటీ పరిధిలో ఏఈఆర్వోలుగా జోనల్ కమిషనర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లను, ఏఆర్వోలుగా ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలను నియమించారు. ఈ మేరకు నోటిఫికేషన్ విడుదలైంది.

తూర్పుకాపులకు మేలు చేసిన జగనన్న సురక్ష

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

చోడవరం: జగనన్న సురక్ష కార్యక్రమం వల్ల జిల్లాలో తూర్పుకాపులకు ఎంతో మంచి జరిగిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు. చోడవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 84 గ్రామ సచివాలయాల పరిధిలో 67,576 అర్జీలను పరిష్కరించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు మంజూరు చేశామన్నారు. వీటిలో 35 వేలు తూర్పు కాపులకు జారీ చేసిన బీసీ డీ ధ్రువపత్రాలే ఉన్నాయన్నారు. వైఎస్సార్ హయాంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న కాపులందరినీ తూర్పుకాపులుగా గుర్తిస్తూ బీసీ డీ సర్టిఫికెట్లు ఇవ్వాలని జీఓ నెంబరు 62 జారీ చేశారని, అది అమలు కాని చోట్ల ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమంలో అందరికీ బీసీ డీ సర్టిఫికెట్లు జారీ చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే తూర్పుకాపులకు ఎంతో మేలు జరిగిందని ధర్మశ్రీ చెప్పారు.

ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, చోడవరం సర్పంచ్ బండి శ్రీను, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వేచలపు ప్రకాష్, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, పాల్గొన్నారు.

సంపూర్ణ సువర్ణ పాలన

- 'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ మేలు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: రాష్ట్ర ప్రజలకు సువర్ణ పాలన అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. పథకాలు అందకుండా అర్హులెవరూ మిగిలిపోరాదన్న ఆశయంతో ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దీంతో అందరికీ మేలు జరిగిందని, సంక్షేమ పాలన సంపూర్ణమైందని చెప్పారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 93 లక్షల 57 వేల మందికి 11 రకాలైన ధ్రువపత్రాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ధ్రువపత్రాలు కావాలంటే ప్రభుత్వానికి కొంత నగదు చెల్లించి నెల రోజులపాటు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివచ్చేదని, ఇప్పుడు ఇంటి వద్దకే ఉచితంగా ధ్రువపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలోని 73 సచివాలయాల పరిధిలో 72,317 కుటుంబాలను సర్వే చేసి 47 వేల దరఖాస్తులను స్వీకరించారని, 45,700 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారని చెప్పారు. మరికొన్ని పత్రాలను ఉన్నతాధికారుల పరిశీలనకు పంపించారని, త్వరలో వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 522 జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించి, 5,28,000 గృహాలకు వెళ్లి 3 లక్షల 60 వేల టోకెన్లను వలంటీర్ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసి 3 లక్షల 50 వేల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేసినట్లు ఆయన చెప్పారు. దేశచరిత్రలో ఇటువంటి కార్యక్రమాలు ఏ ప్రభుత్వం చేపట్టలేదన్నారు.

గడప గడపకు మంచి స్పందన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాల కోసం ఒక్కొక్క సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడంతో ఆ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. జిల్లాలో జాతీయ రహదారిని అనుకుని పట్టణానికి వచ్చే రహదారుల (అప్రోచ్ రోడ్లు) అభివృద్ధికి కౌన్సిల్ సమావేశంలో రూ.15 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. పెరుగుబజార్ జంక్షన్లో రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న 995 గృహాలు 22 ఎలో ఉండిపోవడంతో అక్కడ ప్రజల కోరిక మేరకు సమస్యను పరిష్కరించామన్నారు. అనకాపల్లి–అచ్యుతాపురం రహదారి విస్తరణ పనులకు ఏపీఐసీసీ నుంచి రూ.245 కోట్లు విడుదల చేయగా, రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం రూ.151 కోట్లు ఇస్తుందని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రూ.110 కోట్లతో నర్సీపట్నం–విశాఖ (భీమిలి) రహదారి అభివృద్ధి

నర్సీపట్నం నుంచి రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం, మాడుగుల మీదుగా రూ.110 కోట్లతో విశాఖకు నాలుగు రోడ్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని మంత్రి చెప్పారు. రహదారి విస్తరణలో అనకాపల్లి మండలంలో దర్జీనగర్, రావుగోపాలరావు గ్రామాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు. రూ.32 కోట్లతో కేబీ రోడ్డు (డబుల్‌రోడ్డు) విస్తరణ పనులు జరుగుతున్నాయని, మరో నెల రోజుల్లో పూర్తవుతాయని చెప్పారు.

ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.252 కోట్ల డ్రిప్ నిధులతో 'రైవాడ' ఆధునికీకరణ

- నెలాఖరులోగా పరిపాలన ఆమోదం వచ్చే అవకాశం
- సాంకేతిక అనుమతులు రాగానే పనులు ప్రారంభం
- జిల్లాలోని జలాశయాల్లో పుష్కలంగా నీటి నిల్వలు
- ఖరీఫ్ పంటలకు పుష్కలంగా సాగునీరు
- నీటిపారుదల శాఖ ఎస్ఈ సూర్యకుమార్



రైవాడ జలాశయాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి విశాఖ జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ సూర్యకుమార్, ఈఈ త్రినాథం

దేవరాపల్లి: రైవాడ జలాశయం పునఃపటిష్టత, ఆధునికీకరణకు కేంద్ర జల వనరుల సంఘం నుంచి ఈ నెలాఖరులోగా పరిపాలన ఆమోదం లభించే అవకాశం ఉందని ఉమ్మడి విశాఖ జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ కె.సూర్యకుమార్ తెలిపారు. రైవాడ రిజర్వాయర్‌ను ఈఈ ఎ.త్రినాథంతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ప్రత్యేక చొరవతో రైవాడ జలాశయాన్ని డ్రిప్ (డ్యామ్ రీహేబిలిటేషన్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్) పథకంలో అభివృద్ధి చేసేందుకు ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.252 కోట్లు మంజూరయ్యాయన్నారు. కేంద్ర జలవనరుల శాఖ నుంచి పరిపాలన, సాంకేతిక అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. జిల్లాలోని రైవాడ, పెద్దేరు, కోనాం, తాండవ, కల్యాణపులోవ, మేఘాద్రిగెడ్డ జలాశయాలు నీటితో నిండుగా ఉన్నాయని, ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు సాగునీటికి ఢోకా ఉండబోదన్నారు. రైవాడ జలాశయం కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులకు జైకా నిధులు రూ.30 కోట్లు మంజూరు కాగా ఇప్పటి వరకు రూ.4.50 కోట్ల వ్యయంతో పనులు జరిగాయన్నారు. మిగిలిన పనులు వచ్చే ఖరీఫ్ సీజన్‌కు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. పెద్దేరు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.84 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ పనులకు ఇప్పటికే పరిపాలన ఆమోదం లభించిందని, రెండు, మూడు రోజుల్లో సాంకేతికపరమైన అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు. సాంకేతిక అనుమతులు రాగానే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి కుడి, ఎడమ కాలువలతో పాటు బ్రాంచి కాలువల ఆధునికీకరణ పనులు ప్రారంభిస్తామన్నారు. పెద్దేరు జలాశయానికి చెందిన 4ఎల్ చానల్ నిర్మాణానికి రూ.9.12 కోట్లు మంజూరయ్యాయన్నారు.

ఈ చానల్ నిర్మాణం ద్వారా మాడుగుల మండలంలోని గిరిజనులకు చెందిన సుమారు 800 ఎకరాల పంట పొలాల సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ డీఈఈ జి.సత్యంనాయుడు, టెక్నికల్ డీఈఈ పి.హరిప్రసాద్, కోనాం జలాశయం డీఈఈ సిహెచ్.వేణుగోపాలనాయుడు, ఏఈలు భార్గవ్, కిశోర్, రవిప్రకాష్, నరేష్, శాంతి, జైరామ్ తదితరులు ఉన్నారు.

కారు ఢీకొని కె.కోటపాడు మహిళకు గాయాలు

మద్రిపాలెం: విశాఖపట్నం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కె.కోటపాడుకు చెందిన ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కె.కోటపాడుకు చెందిన పోచర్ల అమ్మాజీ, ఆమె అల్లుడు కనక బాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై బుధవారం సాయంత్రం కేజీహెచ్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో 104 ఏరియా ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఓ కారు ఢీకొనడంతో ఆమె ఎడమ చేతికి గాయాలయ్యాయి. అమ్మాజీ అల్లుడు స్వల్పంగా గాయపడ్డాడు. వారిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రురాలు గురువారం ఫిర్యాదు చేయడంతో సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వృద్ధుడి మృతి


మృతి చెందిన దేవుడు

మాకవరపాలెం: మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన ధనిమిరెడ్డి దేవుడు(60)ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి మృతి చెందాడు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో అతడు సైకిల్‌పై పైడిపాల వచ్చాడు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా గ్రామ సమీపంలో ఈ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో తలపై బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తలసేమియా బాధితునికి పింఛను అందజేత


దొరబాబుకు పింఛను అందజేస్తున్న వలంటీరు

మాడుగుల రూరల్: డి.గోటివాడలో తలసేమియా బాధితుడు గెమ్మిలి దొరబాబుకు రూ.10 వేల పింఛన్ మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ గోకాడ అర్జునరావు, సచివాలయ కన్వీనర్ జి.అప్పలనాయుడు, వలంటీర్ రమాదేవి గురువారం అందజేశారు.

నాణ్యత కొరవడితే సహించేది లేదు


వైద్య సేవలపై రోగులను ఆరా తీస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- అవసరమైతే విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తా
- కె.కోటపాడు సీహెచ్‌సీలో అభివృద్ధి పనుల్లో లోపాలపై డిప్యూటీ సీఎం బూడి అసంతృప్తి


భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

కె.కోటపాడు: అధికారుల పర్యవేక్షణలో పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఆస్పత్రి అదనపు భవనాలు నిర్మించాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీలో రూ.5.20 కోట్లతో చేపట్టిన అదనపు భవన నిర్మాణాలతోపాటు మౌలిక వసతుల కల్పనను గురువారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న రోగుల వార్డులు, వైద్యుల గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్లోరింగ్ టైల్స్, సీలింగ్ మెటీరియల్, డోర్‌లు, ద్వారబంధాల ఏర్పాటులో నాణ్యత పాటించారా లేదా అని ఏపీఎంఎస్‌ఐడీసీ డి.ఈ మధుసూదనరావును అడిగి తెలుసుకున్నారు. టైల్స్ ఏర్పాటుతోపాటు భవన నిర్మాణ సమయంలో లోపాలపై డిప్యూటీ సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ద్వారబంధాలను టేకు కలపతో ఏర్పాటు చేశామని అధికారులు వివరించగా, సంతృప్తి చెందని ఆయన వెంటనే కార్పెంటర్‌తో పరిశీలించి, తనకు చెప్పాలని పార్టీ యువజన విభాగం మండలాధ్యక్షుడు జి.వెంకటరావుకు సూచించారు. అవసరమైతే భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను గుర్తించేందుకు విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తానన్నారు. నిర్మాణ సమయంలో అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తే ఎవ్వరిపైనా ఆరోపణలు చేసే అవకాశం ఉండదన్నారు. ఇక్కడ ఆస్పత్రిని 50 పడకల స్థాయికి మార్చుతామని అప్పటి ప్రజా సంకల్ప యాత్ర బహిరంగ సభలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు రూ.5.20 కోట్లతో భవన నిర్మాణాలు, ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉత్తమ వైద్య సేవలతో రోగుల్లో ఆత్మస్థైర్యం

కె.కోటపాడు సీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఉత్తమ వైద్య సేవలందించి రోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాలని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు అన్నారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడ వైద్య సేవలపై నమ్మకంతో మండల ప్రజలతోపాటు పొరుగున దేవరాపల్లి, వేపాడ మండలాల నుంచి వందలాది మంది వస్తుంటారని తెలిపారు. వారిని ఆప్యాయంగా పలకరించి వైద్య సేవలందించాలన్నారు. వైద్య పరంగా ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం వార్డుల్లో అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీకాంత్ శ్రీను, పైల అమ్మాజి, సర్పంచ్‌లు వంటాకు అప్పాజి, ఎంపీటీసీలు చీపురపల్లి అచ్చిబాబు, వర్రి రామునాయుడు, ఆదిరెడ్డి రామునాయుడు, వైద్యులు సునీల్, హరితాదేవి పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డులో రూ.12.5 కోట్లతో సీసీడ్రైనేజీలు, బీటీరోడ్లు

- రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరించాలి
- రావికమతంలో విప్ ధర్మశ్రీ భూమిపూజ


పనులకు భూమిపూజ చేస్తున్న విప్ ధర్మశ్రీ, ఆర్‌అండ్‌బీ అధికారులు

రావికమతం: గంధవరం నుంచి వెలంకాయ పాలెం వరకు విస్తరణ పనుల దృష్ట్యా బీఎస్ రోడ్డులోని పలు గ్రామాల్లో సీసీడ్రైనేజీలు, బీటీ, సీసీరోడ్ల నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ ప్రత్యేక నిధి నుంచి రూ.12.5 కోట్లు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. దీనిలో భాగంగా రావికమతం – బంగారుమెట్ట ఒక పార్టు కింద రూ.2 కోట్లతో పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు, నూతన కాంట్రాక్టర్లు వెంకన్నబాబు, వెంకట్రావులతో కలిసి గురువారం ఆయన ఈ పనులకు రావికమతంలో భూమిపూజ చేశారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట, చోడవరం ప్రాంతాల్లో బీఎన్ రోడ్డు బాగా దెబ్బతినడానికి ముమ్మాటికీ గత పాలకుల నిర్లక్ష్యమే అన్నారు. విచ్చలవిడిగా గ్రానైట్ క్వారీలకు అనుమతులు తెచ్చుకుని, పరిమితికి మించి భారీ లోడ్‌లు తరలించడంతో ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం, నాయకులు చేయలేని పనిని తాను చేసి చూపించానన్నారు. గంధవరం నుంచి వెలంకాయపాలెం వరకూ రూ.104 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించామని, సదరు ఎస్‌ఆర్ కంపెనీ కాంట్రాక్టర్ టీడీపీకి చెందిన చౌదరి కావడంతో రెండేళ్లపాటు కావాలని కాలయాపన చేశారని ఆరోపించారు. మాట మాటికీ తన పరిధిలో లేదని సమాధానం చెప్పడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్లి జీవో నెంబరు 183, 184తో ఆర్‌అండ్‌బీ ప్రత్యేక గ్రాంటుగా రూ.12.5 కోట్లు మంజూరు చేయించామన్నారు. ఈ పనులకు ఫైనాన్షియల్ క్లియరెన్స్‌తోపాటు హెడ్ ఆఫ్ అకౌంట్ చూపించామన్నారు. దీనికి వేరొక కాంట్రాక్టర్‌కు అప్పగించామన్నారు. ఈ పనులకు స్థానిక పాలకులు సైతం రాజకీయాలు మాని సహకరించాలని సూచించారు. ఎంపీపీ పైల రాజు, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, మాజీ ఉపాధ్యక్షుడు గంటా ఈశ్వరరావు, మండల పరిషత్ ఫ్లోర్ లీడర్ పూడి దేవ, ఎక్స్ అఫిషియో సభ్యుడు గాలి రమణబాబు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రభుత్వ ప్రోత్సాహం


జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్ : ఉద్యాన, వ్యవసాయ పంటల నాణ్యత మెరుగులో డ్రిప్ ఇరిగేషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందని, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా రైతులకు కావాల్సిన బిందు సేద్యం, తుంపర్ల సేద్యం కొరకు ప్రభుత్వ రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమలు వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం వద్ద రైతులకు కావలసిన సూక్ష్మ నీటిసాగు పరికరాల వాహనాన్ని గురువారం జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.వి. లక్ష్మి ఆధ్వర్యంలో జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ పద్ధతి ద్వారా నీరు, కరెంటు, ఎరువులు, కూలీ ఖర్చు ఆదా అవుతుందన్నారు. కలుపు మొక్కలు, తెగుళ్ల సమస్య తట్టుకుని మెరుగైన మొక్కల పెరుగుదల, పంట ఉత్పాదకత, అధిక దిగుబడి లభిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా కేంద్ర (పీఎంకెఎస్‌వై), రాష్ట్ర(ఏపీఎంఐపి) ప్రభుత్వాలు 60:40 సహాయంతో రాయితీ అమలు చేస్తున్నట్టు చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

- మరో యువతికి తీవ్రగాయాలు
- మృతుడు అల్లూరి జిల్లా వాసి


మృతుడు శ్రీనివాసరెడ్డి ఫైల్


గాయపడిన అనిత

నక్కపల్లి/మారేడుమిల్లి : నక్కపల్లి మండలంలో జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి పాడేరు జిల్లా రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ పంచాయతీ పరిధిలోని చెరువుపాలెం గ్రామానికి చెందిన బోడిక శ్రీనివాస్ రెడ్డి (30) మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలస గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన మరో యువతి సార్ల అనితతో కలసి విశాఖపట్నంలో డిపార్ట్‌మెంట్ పరీక్ష రాయడానికి మోటారు సైకిల్‌పై బయలు దేరారు. ఒడ్డిమెట్ట సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. బైక్‌పై వెనుక కూర్చొన్న యువతి అనితకు కుడి చేయి విరిగింది. ఆమెను 108 వాహనంలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల గ్రామస్తులు, యూటీఎఫ్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

40 మంది ఉపాధ్యాయులకు పీఆర్‌టీయూ సత్కారం


బదిలీపై ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న నాయకులు

రోలుగుంట : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, సంక్షేమమే లక్ష్యంగా తమ యూనియన్ పనిచేస్తోందని ఉమ్మడి విశాఖ జిల్లా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.జి.నాథ్, ప్రధాన కార్యదర్శి మద్దు శ్రీను అన్నారు. రోలుగుంట మండలం నుంచి ఇటీవల బదిలీ అయిన 40 మంది ఉపాధ్యాయులతో మండల పీఆర్టీయూ ఆత్మీయ కలియక సమావేశం ఏర్పాటు చేసి వారిని ఘనంగా సత్కరించారు. కూడిన సత్కార సభ బుధవారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యకలాపాల గురించి వివరించారు. వైఎస్సార్ హయాంలో నాలుగు సంవత్సరాల ఉపాధ్యాయ అప్రెంటిషిప్‌ను రెండు సంవత్సరాలకు మార్చడంలో పీఆర్టీయూ కృషి గురించి వివరించారు. ప్రస్తుతం జిల్లాలో అతి పెద్ద యూనియన్‌గా పీఆర్టీయూ ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్ధిగ అప్పారావు, మండల యూనియన్ అధ్యక్షుడు జి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న వలంటీర్లు

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత


విశాఖలో అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న తోటాడ వలంటీర్


అనకాపల్లిలో రమణమ్మకు పింఛన్ అందిస్తున్న వెంకటాపురం వలంటీర్


విశాఖలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వడ్డిప వలంటీర్

మునగపాక/రోలుగుంట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. తాజాగా సంక్షేమ సేవా కార్యక్రమాల్లో పలువురు వలంటీర్లు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మునగపాక మండలం తోటాడ సచివాలయ పరిధిలోని మత్తుర్తి అప్పారావుకు తన కాలు విరిగిపోవడంతో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ కొయిలాడ రేవతి గురువారం అక్కడకు వెళ్లి రూ.2750 పింఛన్ అందజేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన రేజ రమణమ్మ అనారోగ్యంతో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ కాటిపల్లి వెంకటలక్ష్మి పింఛన్ నగదు అందజేశారు. రోలుగుంట మండలం వడ్డిప గ్రామానికి చెందిన వలంటీర్ యు.ఎన్.ఎస్.వి. సత్యవతి విశాఖపట్నం వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న మిరియాల నూకాలమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేసింది.

నవజాత శిశువుకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ త్రిపర్ణ ఆదిలక్ష్మి


గర్భిణులను దీవిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ త్రిపర్ణ ఆదిలక్ష్మి

పాయకరావుపేట: నవజాత శిశువుకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని, ప్రతీ తల్లి ఆరు నెలల వరకు పట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వీవర్స్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 125 దేశాల్లో తల్లిపాల వారోత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారన్నారు. తల్లి పాలల్లో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని, పిండి పదార్థాలు, ప్రోటీన్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, మినరల్స్ సమృద్ధిగా ఉంటాయన్నారు. బిడ్డ ఎదుగుదలకు, మెదడు అభివృద్ధికి ఎంతో సహాయ పడతాయన్నారు. అందుకోసం బాలింతలు కచ్చితంగా తల్లిపాలు మాత్రమే పట్టే విధంగా అంగన్‌వాడీ సిబ్బంది ప్రోత్సహించాలన్నారు. గర్భిణి దశ నుంచే అంగన్‌వాడీ కార్యకర్తలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు తల్లి పాలపై అవగాహన కల్పించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పది రకాల టీహెచ్‌ఆర్ కిట్లు టేక్ హోమ్ రేషన్ పేరుతో అందిస్తున్నారన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సీడీపీవో కె.శ్రీవిద్య, సూపర్‌వైజర్ జి.సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూక్ష్మ వ్యవసాయానికి రూ.44.11 లక్షల రాయితీ

అనకాపల్లి రూరల్ : జిల్లాలో సూక్ష్మ వ్యవసాయానికి సంబంధించి రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జీవీ లక్ష్మి తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను ఇప్పటివరకు 1402 మంది రైతులు డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకోగా 513 మంది రైతుల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశామన్నారు. వీటిలో ఇప్పటివరకు 120 మంది దరఖాస్తుల్లోని 130.03 హెక్టార్లకు ప్రభుత్వం నుంచి పరిపాలనా ఆమోదం లభించింది. జిల్లాలో 23 మండలాలకు చెందిన ఈ రైతులకు రూ44.11లక్షల రాయితీతో సూక్ష్మ వ్యవసాయానికి సంబంధించిన పరికరాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా అందజేసినట్టు ఆమె తెలిపారు. 2023-24 ఏడాదికి జిల్లా లక్ష్యం 1200 హెక్టార్లుగా నిర్ణయించగా ఇప్పటివరకు లక్ష్యానికి మించి 1475.16 హెక్టార్లకు దరఖాస్తులు నమోదయ్యాయి. బిందు సేద్యానికి గరిష్ఠంగా 90 శాతం రాయితీ, తుంపర్ల సేద్యానికి 55 శాతం రాయితీ రైతులకు ప్రభుత్వం ఇస్తోంది. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సూక్ష్మ సేద్యం పరికరాల కోసం అర్హులైన రైతులు ఆధార్, భూమికి సంబంధించిన 1బీ, ఎఫ్ఎంబీ, బ్యాంకు పాసు పుస్తకం, నీటి వనరు తదితర వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని జీవీ లక్ష్మి సూచించారు.

డిప్లమో, పీజీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ డిప్లమో, డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడుచార్య డి.ఎ. నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులను తమ కార్యాలంలో అందజేయాలన్నారు. దరఖాస్తులను ఏయూ వెబ్‌సైట్ (http://www.audoa.in/) నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పీజీ డిప్లమో విభాగంలో సాయంత్రం నిర్వహించే యోగా, డిప్లమో కోర్సుల విభాగంలో ఏడాది కాల వ్యవధితో నిర్వహించే సాయంకాలం కోర్సులు లలిత సంగీతం, ఆధ్యాత్మిక సంగీతం, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, మృదంగం, ఘటం, కంజీర, ఆరు నెలల కాలవ్యవధితో నిర్వహించే యోగా, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, ఫొటోగ్రఫీ, సాఫ్ట్‌స్కిల్స్, కొరియన్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పీజీ డిప్లమో కోర్సులకు ఈ నెల 19న ఉదయం 10 గంటల నుంచి, డిప్లమో కోర్సులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కోర్సుల వారీగా అర్హతలు, ఫీజు వివరాలు తదితర పూర్తి వివరాల కోసం ఏయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మహిళా పోలీసుల సమస్యల పరిష్కారానికి వినతి


మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కనిసెట్టి ఉమ

అనకాపల్లి టౌన్: గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శు(మహిళా పోలీసు)ల సమస్యలను పరిష్కరించాలంటూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను రాష్ట్ర మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు కనిసెట్టి ఉమ కోరారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో మంత్రిని గురువారం కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 14 వేల మంది మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించాలంటూ విన్నవించుకున్నారు. సీఎం జగన్ మానస పుత్రికగా ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళా పోలీస్ వ్యవస్థ సచివాలయాలల్లోని సేవలతో పాటు, పట్టణ, గ్రామ మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. వారి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మంత్రికి అందించారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు జనపరెడ్డి భార్గవి, వి.రమాదేవి, జి.సుజాత, శిరీష, మల్లేశ్వరి, పావని తదితరులు పాల్గొన్నారు.

అగ్రహారం వీధిలో చోరీ

కశింకోట: స్థానిక అగ్రహారంవీధిలో రూ.1.30 లక్షల విలువ కలిగిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి గురువారం రాత్రి అందించిన వివరాలివి. స్థానిక అగ్రహారం వీధిలో అద్దెకు ఉంటున్న భూపతి శ్రీనివాస్ కుటుంబం బుధవారం అచ్యుతాపురం వెళ్లారు. గురువారం వచ్చి చూడగా ఇంటి తలుపులు తాళం కప్ప పగలగొట్టి గదిలో బీరువా తెరచి ఉంది. ఇంట్లో పరిశీలించగా బీరువాలో రెండు తులాల బంగారు నగలు, పది తులాల వెండి సామాన్లు చోరీ అయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రవికుమార్, ఎస్‌ఐ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఇగ్నోలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు గడువును ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు గురువారం ప్రకటనలో తెలిపారు. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. https://ignou admission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఎంవీపీ కాలనీ ఉషోదయ కూడలిలో ఇగ్నో కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లిటౌన్: మండలంలోని అల్లిఖానుడి పాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్ల మరమ్మతు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ కశింకోట డివిజన్ ఈఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

పిచ్చికుక్క దాడిలో ఒకరికి గాయాలు

కశింకోట: స్థానిక గవరపేట ప్రాంతంలో గురువారం పిచ్చి కుక్క కరవడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు మహిళలు దాని బారి నుంచి తప్పించుకోగలిగారు. ఒక వీధి కుక్కకు పిచ్చి పట్టి వీధుల్లో కనిపించిన వారిని కరిచేందుకు వెంటబడుతోంది. ఇదే సమయంలో మాకవరపాలెం నుంచి ఇక్కడి అత్తవారింటికి వచ్చిన నానిని కరవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సిరిపల్లి రత్నం, కాండ్రేగుల మహలక్ష్మిలను వేర్వేరు సమయంలో కాలుపట్టి కరిచేందుకు ప్రయత్నించగా వారు పరుగుతీసి తప్పించుకున్నారు. దీంతో స్థానిక యువకులు కొందరు కలిసి పిచ్చిపట్టిన కుక్కను వెంటాడి కొట్టి చంపేశారు. కశింకోటలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్సీ రైతులకు ప్రకృతి సాగు కిట్ల పంపిణీ



తాళ్లపాలెంలో ఎస్సీ రైతులకు విత్తనాలు, పరికరాలు అందజేత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సచివాలయంలో ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం-ఏజేఏవై) కింద సేంద్రీయ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డు కులాల రైతులకు గురువారం రూ.10 వేల విలువ కలిగిన పరికరాలు, విత్తనాలను ఉచితంగా అందించారు. వీటి సాయంతో ప్రకృతి వ్యవసాయం చేసి, రసాయనాల్లేని ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను అందించాలని నాయకులు, అధికారులు కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు శంకరరావు, భవాని, భాస్కర్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
మెగ్ 2	: సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య S/O కృష్ణన్(మార్నింగ్, మ్యాట్నీ షోలు)	
దిల్‌సే	: సత్యనారాయణ స్క్రీన్-2
కృష్ణగాడు అంటే ఒకరేంజ్	: షిర్డిసాయి
బ్లడ్-చాక్లెట్	: పర్తిసాయి
ఎల్‌జీఎం(లెట్స్ గెట్ మ్యారీడ్)	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
బ్రో	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 231 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,970	4,090
రెండో రకం	3,880	3,900
మూడోరకం	2,200	2,700

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-3 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 401 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 269 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

వరుణుడు కరుణిస్తేనే.. వరి నాట్లు



ఎదుగుదల దశలో ఉన్న వరి నారు



గొబ్బూరులో వరి నాట్లు వేస్తున్న రైతులు

- కశింకోట మండలంలో వానల్లేక వరినాట్లలో జాప్యం
- పంట దిగుబడి తగ్గుతుందన్న ఆందోళనలో రైతులు

కశింకోట: మండలంలో ఖరీఫ్ వరి సాగు ఈ ఏడాది ఆలస్యమవుతోంది. వర్షాలు సకాలంలో కురవక, నారుమళ్లు ఆలస్యంగా వేశారు. అవి ప్రస్తుతం ఎదుగుదల దశలో ఉన్నాయి. అరకొరగానైనా నీటి సదుపాయం ఉన్నచోట వేసిన నారు ఎదిగినప్పటికీ, చాలా చోట్ల సరైన వర్షాల్లేక నాట్లు వేయలేని పిరిస్థితి. ఆశించిన మేరకు వర్షాలు పడితే, ఈ పాటికే నాట్లు పూర్తయ్యేవని రైతులు అంటున్నారు. అయితే వ్యవసాయ అధికారులు మాత్రం నాట్లు వేయడానికి సమయం మించిపోలేదని, భరోసానిస్తున్నారు.

సిద్ధమైన వరి నారు

ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్ సాగులో వరి పంటదే అగ్రస్థానం. గత ఏడాది సాధారణ విస్తీర్ణం(892 హెక్టార్లు) కంటే అదనంగా 200 హెక్టార్లలో వరి సాగు జరిగింది. ఈసారీ సాధారణ సాగు విస్తీర్ణం 892 హెక్టార్లే. అయితే కొంత మంది చెరకు సాగు రైతులు వరి సాగువేపు దృష్టి సారించారు. దీంతో ఈ ఏడాది కూడా సాధారణ సాగు కంటే అధికంగానే వరి సాగు జరుగుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులు మాత్రం సకాలంలో వర్షాలు కురవక ఆలస్యంగా నారుమళ్లు వేశారు. ఇప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాల్లేకపోవడంతో ఒకింత ఆందోళన చెందుతున్నారు. ఇదే కొనసాగితే నాట్లు వేసేందుకు మరింత ఆలస్యం జరిగి, ఇప్పటికే ఎదిగిన నారు ఏమవుతుందోనని భయపడుతున్నారు.

ఆలస్యమైతే దిగుబడిపై ప్రభావం

ఇప్పటికే వర్షాలు ఆలస్యం అయినందున నారుమళ్ల వేయడంలో కాస్త జాప్యం నెలకొంది. నాట్లు కూడా సరైన వర్షాలు లేక ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ఇలా అయితే పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వర్షాధారంగానే అత్యధికంగా వరి సాగు చేస్తారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో వర్షాలు ఆశించిన మేరకు ఉన్నా, కశింకోటలో మాత్రం అంతంత మాత్రంగానే వర్షాలు కురిశాయి. నీటి సదుపాయం ఉన్నచోట భూములను దమ్ముపట్టి సిద్ధం చేస్తున్నారు. నీటి సదుపాయం లేనిచోట వర్షాల కోసం ఎదురు చూస్తున్నారు. సకాలంలో నాట్లు వేయకపోతే ఇప్పటికే ఎదిగిన నారు ఎందుకూ పనికిరాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు నాట్లు పూర్తి కావాలి. గొబ్బూరు, అడ్డాం దాని పరిసర గ్రామాల్లో మాత్రమే కొంత మేర నాట్లుపడ్డాయి.

వానలు పడితేనే వరి నాట్లు



ఏటా వరి పండిస్తాం. వరి నారు వేశాం. ఎదుగుదల దశలో ఉంది. ఈ ఏడాది వర్షాలు ఆశించినంతగా లేవు. దీంతో నారు వేయడం ఆలస్యమైంది. లేదంటే ఇప్పటికే నాట్లు పూర్తయ్యేవి. ఇప్పటికీ సరిపడా వర్షాలు కురవడం లేదు. వర్షాలు కురిస్తే నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– పిట్టా సన్యాసిరావు, రైతు, నూతలగుంటపాలెం

గతేడాది ఈపాటికే నాట్లు పూర్తి



ఎకరం భూమిలో నాలుగేళ్లుగా వరి పంట సాగు చేస్తున్నాం. ఇందులో 70 సెంట్లు కౌలుకు తీసుకున్నదే. గత ఏడాది ఇదే సమయానికి నాట్లు వేయడం పూర్తి అయింది. ఈ ఏడాది ఆలస్యమైంది. ప్రస్తుతం నారుమళ్లు ఎదుగుదల దశలో ఉన్నాయి. వర్షాలు కురిస్తే దమ్ముపడతాం.

– మేరపురెడ్డి అప్పారావు, రైతు, తాళ్లపాలెం

15 తర్వాత ముమ్మరంగా నాట్లు

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 892 హెక్టార్లు. గత ఏడాది 1,121 హెక్టార్లతో సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు వేశారు. ఈ ఏడాది కూడా చెరకు రైతులు వరి సాగు వైపు మళ్లుతుండటం వల్ల గత ఏడాది కంటె ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు పడతాయనుకుంటున్నాం. వరి నాట్లుకు ఇంకా సమయం ఉంది. ఏటా ఇదే నెలలో నాట్లు వేస్తున్నారు. ప్రస్తుతం వరి నారుమళ్లు ఎదుగుదల దశలో ఉన్నాయి. ఈ నెల 15 తర్వాత నుంచి వరి నాట్లు ముమ్మరంగా వేసే అవకాశాలున్నాయి.

– స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్‌కు డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న కార్మిక నాయకులు



ఆందోళనలో పాల్గొన్న కార్మికులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో పనిచేస్తున్న కార్మికులకు డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ చేయాలని ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులు సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేట్ ఎదుట గురువారం భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించడానికి యాజమాన్యం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ టెస్టుల నెపంతో వేధింపులు ఆపాలన్నారు. కార్మికులకు ఎన్టీపీసీ లోగోతో కూడిన ఐడీ కార్డులు మంజూరు చేయాలన్నారు. కార్మికులకు రెండేళ్లుగా డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. రూ.2,350 చెల్లిస్తామని చెప్పి నేటికీ అగ్రిమెంట్ చేయకుండా కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని కార్మిక నేతలు ఆరోపించారు. మహారత్న పరిశ్రమగా ఉన్న ఎన్టీపీసీలో కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించేంత వరకూ సమ్మెను కొనసాగిస్తామని కార్మిక నేతలు హెచ్చరించారు. మెయిన్‌గేటు నుంచి పరిపాలన భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆందోళనలో కార్మిక నాయకులు జి.పెంటారెడ్డి, ఎల్.కంటిరెడ్డి, బొట్టా రమణ, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, పి.పోతినాయుడు, గోవింద రాజు, రామారావు పాల్గొన్నారు.

భారీగా పెరిగిన టమాటా ధర



కశింకోట సంతలో విక్రయిస్తున్న టమాటాలు, కూరగాయలు

కశింకోట: స్థానికంగా నిర్వహించిన గురువారపు సంతలో టమాటా ధర గతంలో ఎన్నడూ లేని విధంగా కిలో రూ.200కు అమ్మకాలు జరిగాయి. గత వారం కిలో రూ.150 ఉండగా, ఈ వారం ఏకంగా రూ.50 పెరిగింది. దీంతో టమాటా కొనేందుకు సాహసించలేని పరిస్థితి. సాధారణంగా ఈ సమయంలో చిత్తూరు జిల్లా నుంచి సంతకు టమాటా తీసుకొచ్చేవారు. ఈ ఏడాది అక్కడ వర్షాల వల్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో ధర పెరిగిందని వ్యాపారులు చెప్పున్నారు. బీరకాయ రూ.60 నుంచి రూ.80కి పెరిగింది. ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప, వంకాయ, క్యాబేజీ రూ.30, బరబాటి, బెండకాయ, దొండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం రూ.వందకు విక్రయాలు సాగాయి.

గర్భిణులు, బాలింతలకు మరింత పోషణ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, దంతులూరి దిలీప్ కుమార్



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కోట్నివీధిలో టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీలో కోరుకొండ రాఘవ



పాతబర్మాకాలనీలో టీహెచ్‌ఆర్ కిట్లను పంపిణీ చేస్తున్న జాజుల రమేష్

అనకాపల్లిటౌన్: గర్భిణులకు, బాలింతలకు మరింత పోషణ అందించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల(టీహెచ్‌ఆర్)ను అందిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ తెలిపారు. వార్డు పరిధిలోని పాతబర్మాకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో టీహెచ్‌ఆర్ కిట్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాన్ని వండి, వడ్డించేవారని, ప్రస్తుతం ఇళ్ల వద్దే వారికి నచ్చినట్టు వండుకునేలా టీహెచ్‌ఆర్ కిట్లను అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రతీ నెల 5,17 తేదీల్లో ముఖ ఆధారిత హాజరు ద్వారా కిట్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి కుండల రామకృష్ణ, పార్టీ నేతలు చవితిని నూకరాజు, చింతా రాంజీ, బలిరెడ్డి నూకరాజు, పైన నాగేశ్వరరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

84వ వార్డు పరిధిలో..

84వ వార్డు పరిధిలో వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టీహెచ్‌ఆర్) కిట్లను కోట్నివీధి, గొల్లవీధి, పిళ్లావారివీధి తదితర ప్రాంతాల్లో 30 మంది గర్భిణులు, బాలింతలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న టీహెచ్‌ఆర్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.లక్ష్మి, పార్టీ నాయకులు కోట్ని శ్రీనివాసరావు, కేతిరెడ్డి ప్రసాద్, నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు కె.నాగసంతోష్, ఎస్.వి జయలక్ష్మి, పి.మాలతి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సరకులతో కూడిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టీహెచ్‌ఆర్) కిట్లను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన సభలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా టీహెచ్‌ఆర్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పది రకాల సరకులతో కూడిన పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు మాత్రమే వినియోగించాలన్నారు. బాలింతలు పోషకాహార లోపం లేకుండా, గర్భిణులు రక్తహీనత బిడ్డలకు జన్మనివ్వకుండా ఈ కిట్‌లో ఉన్న సరకులు దోహదపడతాయన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో పి.ప్రభావతి మాట్లాడుతూ ఇప్పటి వరకు బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రంలోనే పోషకాహారాన్ని తయారు చేసి అందించేవారిమన్నారు. అయితే వారు రావడానికి పడుతున్న ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నేరుగా వారింటికే సరకుల్ని అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వైఎస్సార్ పోషణ కిట్‌లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర లీటర్ నూనె, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో వంతున బెల్లం, ఎండు ఖర్జూరం, వేరుశనగ చెక్కితోపాటు 25 కోడిగుడ్లను కూడా అందిస్తున్నట్లు తెలిపారు. 3 నెలల గర్భిణీ నుంచి, ఆరు మాసాల బాలింత వరకు ప్రతి నెలా సరకులను అందిస్తామన్నారు. తల్లిపాలు విశిష్టమైనవని, వీటిని పిల్లలకు తప్పనిసరిగా ఆరు నెలల వరకు అందివ్వాలని బాలింతలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వంశీప్రియ, సుచరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం మహిళలకు ఓ వరమని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని తుమ్మపాల వైఎస్సార్ కల్యాణ మండపంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ(టీహెచ్‌ఆర్) కిట్లను గర్భిణులకు, బాలింతలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషకలోపం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో కోతలు పెట్టి భారం తగ్గించుకుంటే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, అందుకే అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శశికళ, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్ర శేఖర్, కల్యాణ చక్రవర్తి, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వడ్డాది భారతి, అశోక్, ఉప సర్పంచ్ చదరం చిన్న, పంచాయతీ వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



సత్తెమ్మతల్లి సన్నిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, దాడి రత్నాకర్ తదితరులు



కస్పావీధి సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న మళ్ల బుల్లిబాబు

అనకాపల్లిటౌన్: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల మహోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్‌లు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని దాడి రత్నాకర్ ప్రారంభించారు. అంతకుముందు కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ మోహనరావు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రత్నాకర్‌లను శాలువాలతో సత్కరించి, అమ్మవారి ఫొటోలను అందించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, కమిటీ కార్యదర్శి విల్లూరి త్రినాథ్, కోశాధికారి దాడి వెంకునాయుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక కస్పావీధి పొలాల్లో వెలసిన సత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, భక్తులు, రైతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లిబాబు మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న అమ్మ వారి ఆలయానికి తన వంతు సాయంగా, అవసరమైన మేరకు సిమెంట్ బస్తాలు అందిస్తానని ప్రకటించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నడిపల్లి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు నడిపల్లి నాయుడు, పండూరి ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం, ఆరోగ్యం



స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: పెరటి కోళ్ల పెంపకం వల్ల ఆదాయంతో పాటు, ఆరోగ్యకరమైన మాంసాహారాన్ని పొందవచ్చని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం స్వయం సహాయక సంఘాల మహిళలకు రాయితీపై 50 యూనిట్ల పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోషకాహారం అందుబాటులోకి తీసుకు రావడం కోసం ప్రభుత్వం పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఒక్కొక్క యూనిట్‌లో 11 కోళ్లను రూ.4 వేలకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కోళ్లు పెట్టే గుడ్లను రోజుకి ఒకటి వంతున తినాలని, కుటుంబ సభ్యులతో కూడా తినిపించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామా ల్లో ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలు పెరటి కోళ్ల కోసం వీవోఏ, సీసీలను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన



కశింకోటలోని గోవిందరావు కాలనీలో లోకోస్ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న వెలుగు సిబ్బంది

కశింకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు, రాయితీలు పొందేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యుల తమ వివరాలను లోకోస్ యాప్‌లో నమోదు చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు కోరారు. కశింకోటలోని గోవిందరావు కాలనీలో గురువారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు లోకోస్ యాప్‌పై అవగాహన కల్పించి, వారి వివరాల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్‌లో వివరాలు నమోదు చేయడం వల్ల దేశంలోని స్వయం సహాయక సంఘాలన్నీ ఒకే గొడుగు కింద ఉంటాయన్నారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందరికి ఒకే విధానంలో అందుతాయన్నారు. ఆధార్, బ్యాంకు అక్కౌంట్లతో స్వయం సహాయక సంఘ మహిళలు తమ పేర్లను యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ సత్యనారాయణ, వీవోఏ రాము తదితరులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



తవ్వవానిపాలెంలో పచ్చిరొట్ట ఎరువుల క్షేత్రాలను పరిశీలిస్తున్న ఏడీ రామారావు తదితరులు

సబ్బవరం: మేలైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా రైతులు నాణ్యమైన అధిక దిగుబడులను సాధించవచ్చని అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం. రామారావు తెలిపారు. మండలంలోని తవ్వవానిపాలెంలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు సూచనలు, సలహాలను అందించారు. వరి, గంటి పంటల సాగు పద్ధతులను, ఆచరించాల్సిన విధానాలపై చర్చించారు. రైతులు వరి పంటకు ముందు పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవడం మంచి సంప్రదాయమని తద్వారా భూమిని సారవంతం చేయడంతో పాటు నేలను పరిరక్షించుకోవచ్చన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో రైతులు వేసుకొన్న వరి నారుమడులను పరిశీలించారు. చాలా నారుమడులలో ఇనుపధాతు లోపం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. దీనిని నియంత్రించేందుకు అన్నబేది 20 గ్రాములు నిమ్మ ఉప్పుతో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. పంట కాలంలో విచక్షణారహితంగా పురుగు మందులు వాడకుండా సమతుల్యంతో ఎరువులను వినియోగించి అధిక దిగుబడులను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



వెదుళ్లనరవలో జేసీబీ సాయంతో అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: జీవీఎంసీ పరిధిలోని వెదుళ్లనరవలోని గెడ్డవాగుపై నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను రెవెన్యూ సిబ్బంది గురువారం తొలగించారు. సర్వే నంబర్ 98లో ప్రభుత్వ భూమి గెడ్డవాగులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తహసీల్దార్ బి. సత్యనారాయణ ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో వెంకటేష్‌లు జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడేవారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు, వీఆర్ఏ అప్పలరాజు ఆక్రమణల తొలగింపును పర్యవేక్షించారు.

చురుగ్గా వంతెన నిర్మాణం

సబ్బవరం: నారపాడు శివారు బలిజపాలెంలోని రామాలయం వద్దనున్న గెడ్డకు రిటర్నింగ్ వాల్, వంతెన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఇచ్చిన హామీ మేరకు పనులు చేపట్టినట్టు ఎంపీటీసీ మామిడి లక్ష్మి తెలిపారు.

నేడు 'పోషణ' కిట్ల పంపిణీ

సబ్బవరం : సబ్బవరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేస్తారని తెలిపారు.